రిపోర్టర్లు కావలెను
ప్రకాశం జిల్లాలో
'జాతీయ వార్త' తెలుగు దినపత్రికలో
పనిచేసేందుకు ఆసక్తి ఉన్న
రిపోర్టర్లు సంప్రదించగలరు
9908862557

జాతీయ
# వార్త
తెలుగు దిన పత్రిక
epaper:jatheeyavaartha.com
www.jatheeyavaartha.com




సోమవారం | 9-3-2026 | ప్రకాశం | సంపుటి: 3 సంచిక: 611 పేజీలు: 2 వెల : రూ.7

## మహిళలు..

✳ వారి సంక్షేమమే కూటమి ప్రభుత్వం లక్ష్యం ✳ మహిళలు ఎదిగేందుకు తోడ్పాటు ✳ ఇతరులకు స్ఫూర్తిగా నిలవాలి ✳ ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు ✳ 1683 స్వయం సహాయక సంఘాలకు, 238 కోట్ల రుణాలు పంపిణీ ✳ మహిళా మణులకు సన్మానం ✳ కందుకూరులో ఘనంగా మహిళా దినోత్సవం

# స్వయం శక్తిమంతులు

**కందుకూరు, మార్చి 8 (జాతీయవార్త):** మహిళలు స్వయం శక్తిమంతులని, వారు మరింతగా ఎదిగేందుకు కూటమి ప్రభుత్వం అన్ని విధాలుగా తోడ్పాటును అందిస్తుందని కందుకూరు ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు అన్నారు. ఆదివారం కందుకూరు పట్టణంలోని జడ్పీ బాలుర హైస్కూల్‌లో ఐసిడిఎస్, డిఆర్డిఏ, మెప్మా శాఖల ఆధ్వర్యంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ముఖ్యఅతిథిగా ఎమ్మెల్యే పాల్గొని మాట్లాడారు. మహిళలు. పురుషులతో సమానంగా ప్రతిభ కనబరుస్తూ అన్నిరంగాలలో దూసుకుపోతున్నారన్నారు. మహిళలు తమ కాళ్ల మీద తాము నిలబడటంతో పాటు, ఇతరులకు స్ఫూర్తిగా నిలవాలని కోరారు. ముఖ్యమంత్రి చంద్రబాబు తీసుకువచ్చిన డ్వాక్రా గ్రూపుల వ్యవస్థ రాష్ట్ర మహిళల దిశను మార్చేసిందన్నారు. మహిళల వంటకష్టాలు చూడలేక దీపం పథకాన్ని ప్రవేశపెట్టిన గొప్ప వ్యక్తి చంద్రబాబు అని అన్నారు. చదువుకునే పిల్లలందరికీ తల్లికి వందనం, స్త్రీ శక్తి పేరుతో ఉచిత బస్సు ప్రయాణం, ఏడాదికి మూడు ఉచిత గ్యాస్ సిలిండర్లు.. ఇవన్నీ ఈ ప్రభుత్వంలో మహిళలకోసం అందిస్తున్న పథకాలు అంటూ గుర్తు చేశారు. ఆడబిడ్డల చదువుల కోసం ఎన్టీఆర్ విద్యాలక్ష్మి, పేదింటి ఆడ పిల్లల పెళ్లిళ్ల కోసం ఎన్టీఆర్ కల్యాణలక్ష్మి పథకాలు కొత్తగా అమల్లోకి వచ్చాయని చెప్పారు. ఆడబిడ్డల సంక్షేమం కోసం చంద్రబాబు అధిక ప్రాధాన్యత ఇస్తున్నారని తెలిపారు. కూటమి ప్రభుత్వాన్ని ఆశీర్వదించింది ఎక్కువగా మహిళలేనన్నారు. డ్వాక్రా సంఘాలు మరింత బలోపేతం కావాలని కోరారు. కందుకూరు నియోజకవర్గంలో త్వరలో స్కిల్ డెవలప్మెంట్ సెంటర్ ఏర్పాటు కాబోతోందని, యువతులు, మహిళలకు ప్రాధాన్యత ఉంటుందని చెప్పారు. త్వరలో వివోఏలకు సెల్ ఫోన్లు, ఏపీఎంలకు ల్యాప్ టాప్ లు ఇవ్వబోతున్నారన్నారు. 18 సంవత్సరాల లోపు యువతులకు వివాహాలు చేయవద్దని సూచించారు. వారిని చక్కగా చదువుకోనివ్వండని తల్లిదండ్రులను కోరారు. కందుకూరు నియోజకవర్గం పారిశ్రామిక కేంద్రంగా మారబోతోందని, త్వరలో వేల సంఖ్యలో ఉద్యోగాలు రాబోతున్నాయన్నారు. సబ్ కలెక్టర్ హిమవంశీ మాట్లాడుతూ దేశంలోని ఐఏఎస్‌లలో 40 శాతం మంది మహిళలు ఉన్నారని తెలిపారు. మన రాష్ట్రంలోని డ్వాక్రా సంఘాలు పనితీరుకు దేశంలోనే గుర్తింపు ఉందన్నారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న పథకాలను అందిపుచ్చుకొని, మహిళలు మరింత బలమైన శక్తిగా ఎదగాలని సబ్ కలెక్టర్ ఆకాంక్షించారు. ఈ సందర్భంగా నియోజకవర్గం వ్యాప్తంగా 1683 స్వయం సహాయక సంఘాలకు, 238 కోట్ల రుణాలను ఎమ్మెల్యే చేతుల మీదుగా అందించారు. వివిధ రంగాలలో ఉత్తమ సేవలందించిన మహిళా మణులను ఘనంగా సత్కరించడంతోపాటు, మెమెంటోలు అందజేశారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ కె.అనూష, ఏరియా వైద్యశాల వైద్యాధికారి ఇంద్రాణి, నియోజకవర్గ తెలుగు మహిళ అధ్యక్షురాలు కల్లూరి శైలజ, ప్రొఫెషనల్ వింగ్ అధ్యక్షురాలు పువ్వాడి మౌనిక, మెప్మా సీఎంఎం ఫణికుమారి, మెడికల్ ఆఫీసర్ బ్యూలా గ్రేస్, సమైక్య అధ్యక్షురాలు, ఏపిఎంలు, వివోఏలు, ఆర్పీలు, అంగన్వాడి సిబ్బంది పాల్గొన్నారు.













## రెండు నెలల్లో నిర్వాసితులకు పరిహారం

- జిల్లా కలెక్టర్ రాజాబాబు
- కొరిశపాడు రిజర్వాయర్ పరిశీలన

**కొరిశపాడు, మార్చి 8 (జాతీయవార్త):** కొరిశపాడు రిజర్వాయర్‌కు సంబంధించి నిర్వాసితులకు నష్టపరిహారం చెల్లింపుతో పాటు రిజర్వాయర్ వద్ద పెండింగ్లో ఉన్న పనులను కూడా రెండు నెలల్లో పూర్తిచేసేలా చర్యలు తీసుకుంటున్నట్లు జిల్లా కలెక్టర్ పి.రాజాబాబు చెప్పారు. ఆదివారం ఆయన ఈ రిజర్వాయర్ ను పరిశీలించారు. ప్రాజెక్ట్స్ ఎస్ఈ అబూత్ అలీం, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ విజయజ్యోతితో కలిసి రిజర్వాయర్ పనులపై సమీక్షించారు. స్థానికులతోనూ ఆయన చర్చించారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ గుండ్లకమ్మ నది నుంచి నీటిని ఎత్తిపోతల ద్వారా ఈ రిజర్వాయరుకు తరలించేందుకు అడ్డంకిగా ఉన్న అన్ని సమస్యలను పరిష్కరిస్తామన్నారు. ఎత్తిపోతల, పైప్ లైన్ పనులు పూర్తయ్యాయని చెప్పారు. నిర్వాసితులకు నష్టపరిహారంతో పాటు రిజర్వాయర్ వద్ద కట్ట నిర్మాణ పనులు కొంతమేరకు పూర్తి కావాల్సి ఉందన్నారు. వీటి గురించి ముఖ్యమంత్రి వద జరిగిన సమావేశంలోనూ ప్రస్తావన వచ్చిందన్నారు. మొదట విడతలో ప్రభుత్వం రూ.35 కోట్లను బడ్జెట్లో కేటాయించిందన్నారు. ఇరిగేషన్ మంత్రి నిమ్మల రామానాయుడు కూడా ఈ పనులను పూర్తి చేసేందుకు ప్రత్యేక దృష్టి సారించినట్లు కలెక్టర్ తెలిపారు. రిజర్వాయర్ కింద ఉన్న సుమారు పదివేల ఎకరాల ఆయకట్టుకు నీరు అందిస్తామని ప్రకటించారు. ఈ పర్యటనలో కలెక్టర్ వెంట ఎంపీడీవో ఆర్. రాజ్యలక్ష్మి, తహసిల్దార్ జి.వి. సుబ్బారెడ్డి, ఇతర అధికారులు ఉన్నారు.

## లెనిన్‌నగర్‌లో మహిళా దినోత్సవం

**కందుకూరు, మార్చి 8(జాతీయవార్త):** కందుకూరు పట్టణంలోని లెనిన్ నగర్‌లో ఆంధ్రప్రదేశ్ మహిళా సమాఖ్య ఆధ్వర్యంలో జిల్లా గౌరవ అధ్యక్షులు సుదర్శి రావమ్మ అధ్యక్షతన ఘనంగా అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకలు ఆదివారం జరిగాయి. ముందుగా ఆంధ్రప్రదేశ్ మహిళా సమాఖ్య జెండాను పాకల జయమ్మ ఆవిష్కరించారు. ముఖ్యఅతిథిగా పాల్గొన్న ఆంధ్రప్రదేశ్ మహిళా సమాఖ్య అధ్యక్షురాలు విజయ మాట్లాడుతూ మహిళలు అణగదొక్కబడుతున్న దేశంలో మనం ఉన్నామని, వాటిని ఎదుర్కోవాలంటే మనకంటూ ఒక ప్రత్యేక స్థానం ఉండాలన్నారు. మహిళల కోసం ఏర్పాటు చేసిన చట్టాలను ప్రతి ఒక్కరు తెలుసుకొని ముందుకు సాగాలన్నారు. ప్రభుత్వాలు మహిళల కోసం ప్రత్యేక చట్టాలు తీసుకొచ్చామని పదేపదే చెబుతున్నారని అయితే మహిళలపై ఇంకా దాడులు ఎందుకు జరుగుతున్నాయని ఆమె ప్రశ్నించారు. చట్టాలను నామ్‌కే వాస్తె తీసుకొచ్చి వాటిని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలుపరచడం లేదన్నారు. మహిళలపై దాడులు చేస్తున్న బడా బాబులను రక్షించేందుకు ప్రయత్నాలు చేస్తున్నారని ఆమె ఆరోపించారు. పురుషులతో సమానంగా మహిళలు ప్రతి రంగంలో ముందుంటున్నారని అయితే వారికి సమానంగా వేతనాలు ఇవ్వకుండా మహిళల పట్ల వివక్షత చూపుతున్నారని ఆమె అన్నారు. మనకి రావాల్సిన హక్కులను మనం కాపాడుకునేందుకు మహిళలందరూ కలిసి పోరాడాల్సిన అవసరం ఎంతైనా ఉందని ఆమె అన్నారు. రైతు సంఘం నాయకులు కే వీరారెడ్డి మాట్లాడుతూ ప్రతి పనిలో మహిళ ముందుంటుందని పంటలు పండించే రైతులలో ఎక్కువ శాతం మహిళలే ఉంటున్నారని వారు తలుచుకుంటే దేశ ఆర్థిక స్థితిగతులను సైతం మార్చగలిగిన శక్తి మహిళలకు ఉందని ఆయన అన్నారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని అంతర్జాతీయ రైతు మహిళా దినోత్సవంగా జరుపుకోవాలని ఐక్యరాజ్యసమితి చెప్పడం జరిగిందని ఆయన తెలిపారు. మహాత్మా గాంధీ జాతీయ ఉపాధి హామీ పథకం ద్వారా మహిళలకు ఉపాధి కలిగించడంలో కమ్యూనిస్టు పార్టీ పోరాటం చేసిందని అయితే దేశ ప్రధాని నరేంద్ర మోడీ దానిని విచ్ఛిన్నం చేస్తూ రాంజీ ఉపాధి హామీ పేరు మార్చి పేదలకు ఉపాధి లేకుండా చేస్తున్నారని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయురాలు సుదర్శి స్రవంతి, ఆంధ్రప్రదేశ్ మహిళా సమాఖ్య జిల్లా ఉపాధ్యక్షులు రావులకొల్లు లక్ష్మి, సిపిఐ కందుకూరు నియోజకవర్గం కార్యదర్శి బి సురేష్ బాబు, ఏఐటీయూసీ నియోజకవర్గ అధ్యక్ష కార్యదర్శులు కే మురళి, వై ఆనందమోహన్, సిపిఐ నాయకులు ఉప్పుటూరు మాధవరావు, కోటేశ్వరరావు, ఆంధ్రప్రదేశ్ మహిళా సమాఖ్య నాయకులు వలేటి కల్పన, మెండా శైలజ, బెల్లంకొండ జ్యోతి, లింగా బత్తిన మాధురి, స్థానిక మహిళలు తదితరులు పాల్గొన్నారు.



### టీడీపీ కార్యాలయంలో..

# మహిళా దినోత్సవం

- కేక్ కట్ చేసిన ఎమ్మెల్యే సతీమణి సౌజన్య
- మహిళలు అన్ని రంగాల్లో ముందుండాలి
- నా భర్త గెలుపులో మహిళల పాత్ర కీలకం
- ఎమ్మెల్యే నాగేశ్వరరావు సతీమణి సౌజన్య



కందుకూరు, మార్చి 8(జాతీయవార్త): అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా కందుకూరులోని టిడిపి కార్యాలయంలో ఆదివారం మహిళా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు సతీమణి సౌజన్య ముఖ్యఅతిథిగా హాజరై కేక్ కట్ చేసి, మహిళలకు శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మహిళల కోసం రాష్ట్ర ప్రభుత్వం అనేక సంక్షేమ పథకాలు అమలు చేస్తోందని, వాటిని వినియోగించుకోవాలన్నారు. మహిళలంతా వివిధ రంగాల్లో ఉన్నత స్థానానికి చేరుకోవాలని ఆకాంక్షించారు. గత ఎన్నికల్లో ఎమ్మెల్యే గెలుపులో మహిళల పాత్ర ఎంతో ఉందన్నారు. రాబోయే 2029 ఎన్నికల్లో కూడా నాగేశ్వరరావు గెలుపునకు కృషి చేయాలని కోరారు. పట్టణ టిడిపి అధ్యక్షుడు దామా మల్లేశ్వరరావు మాట్లాడుతూ ప్రస్తుత సమాజంలో మహిళలు అన్ని రంగాలను శాసించే స్థాయికి ఎదిగారని కొనియాడారు. రాజకీయ రంగంలో ఎదిగేందుకు చంద్రబాబు అనేక అవకాశాలు కల్పిస్తున్నారని గుర్తు చేశారు. ఈ సందర్భంగా మహిళలందరికీ మహిళా దినోత్సవ శుభాకాంక్షలు తెలియజేశారు. అనంతరం తెలుగు మహిళల ఆధ్వర్యంలో పోటీలు నిర్వహించారు. కార్యక్రమంలో పట్టణ టిడిపి అధ్యక్షురాలు ముచ్చు లక్ష్మీరాజ్యం, నియోజకవర్గ ప్రొఫెషనల్ వింగ్ అధ్యక్షురాలు పువ్వాడ మౌనిక, ఘట్టమనేని అఖిల, ముళ్ళపాటి బుజ్జమ్మ, బత్తిన ఆదెమ్మ, అత్తంటి శ్రీలక్ష్మి, పలువురు ఆర్యవైశ్య మహిళలు పాల్గొన్నారు.







### ఎంపీడీవో కార్యాలయంలో

# ఖాళీ పోస్టులను భర్తీ చేయండి

- సిబ్బంది కొరతతో ప్రజల అవస్థలు
- ప్రజలకు అందని పౌర సేవలు

**వలేటివారిపాలెం, మార్చి 8 (జాతీయ వార్త):** వలేటివారిపాలెం మండల పరిషత్ కార్యాలయంలో సిబ్బంది కొరత వలన సకాలంలో ప్రజలకు సేవలు అందక తీవ్ర ఇక్కట్లకు గురి అవుతున్నారు. మండల పరిషత్ అభివృద్ధి అధికారి, ఏవో, డిప్యూటీ ఎంపీడీవో, గ్రామ సచివాలయాల డిప్యూటీ ఎంపీడీవోలు విధులను నిర్వహిస్తున్నారు. జూనియర్ అసిస్టెంట్, సీనియర్ అసిస్టెంట్ పోస్టులను భర్తీ చేయలేదు. టైపిస్టు తన విధులతోపాటు జూనియర్ అసిస్టెంట్, సీనియర్ అసిస్టెంట్ విధులను నిర్వహిస్తున్నారు. అటెండర్లు నాలుగు పోస్టులకు గాను ఒకరు మాత్రమే ఉండగా, మిగిలిన మూడు పోస్టులు ఖాళీగా ఉన్నాయి. మండలంలో 21 గ్రామ పంచాయతీలు ఉండగా 8 మంది గ్రామ కార్యదర్శులు మాత్రమే 13 పంచాయతీలకు ఇన్చార్జులు బాధ్యతలు అయితే ఎనిమిది మంది కార్యదర్శుల్లో ఒకరు సెలవుపై వెళ్ళారు. మండలంలో సిబ్బంది కొరతతో ప్రజల అవస్థలు వర్ణనాతీతంగా ఉన్నాయని ఇప్పటికైనా అధికారులు స్పందించి ఖాళీ పోస్టులను భర్తీ చేయాలని ప్రజలు కోరుతున్నారు.




Printed and published and Owner by Chowdari Pramod Kumar , printed at Chowdari Printers, Near RTC complex, Arts colleage wall beside, Hodco colony,srikakulam-532001, AP.
Published at Near RTC complex, Arts colleage wall beside, Hodco colony, Srikakulam-532001. Editor: Chowdari Pramod Kumar, E-mail:jatheeyavaartha@gmail.com.cell. 9963063761, 9160000247, RNI/APTEL:2023/87546